


# క్వశ్చన్ మార్క్

## కడక్ సింగ్

ఓటీటీ హిట్

**నెట్‌ఫ్లిక్స్:** డిసెంబర్ 8
**నటీనటులు:** పంకజ్ త్రిపాఠి, పార్వతి తిరువోట్టు, సంజనా సంఘి తదితరులు
**దర్శకత్వం:** అనిరుద్ధరాయ్ చౌదరి

**‘మీర్జాపూర్’** వెబ్‌సిరీస్‌తో ఓటీటీ స్టార్‌గా పేరు తెచ్చుకున్నాడు పంకజ్ త్రిపాఠి. ఆయన ఏ సినిమా చేసినా, వెబ్‌సిరీస్‌లో కనిపించినా ఏదో కొత్తదనం ఉంటుందనేంత పేరు తెచ్చుకున్నాడు. ఇటీవల విడుదలైన ‘ఓ మై గాడ్ 2’ సినిమాలోనూ పంకజ్ తన నటనతో అదరగొట్టాడు. తాజాగా ఆయన నటించిన ‘కడక్ సింగ్’ జీ5లో రికార్డు స్ట్రీమింగ్ నమోదు చేస్తున్నది. ఇంతకీ ఈ సినిమా కథేంటంటే.. ఏకే శ్రీవాస్తవ్ (పంకజ్ త్రిపాఠి) ఆర్థిక నేరాల నిరోధక శాఖలో పనిచేస్తుంటాడు. పని విషయంలో రాజీపడడు. ఎలాంటి ఒత్తిళ్లకూ తలొగ్గడు. విధి నిర్వహణలో పడి కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తాడు. ఇంట్లో స్ట్రిక్ట్‌గా ఉండేసరికి కుటుంబసభ్యులు అతణ్ని కడక్ సింగ్ అని పిలుస్తుంటారు. రొటీన్‌గా సాగుతున్న అతని జీవితంలో ఊహించని పరిణామాలు ఎదురవుతాయి. ఒకరోజు కడక్ సింగ్ ఆత్మహత్యకు యత్నిస్తాడు. అదృష్టవశాత్తు ప్రాణాలు నిలుస్తాయి. చికిత్స కోసం ఆస్పత్రిలో చేరుతాడు. స్పృహలోకి వచ్చేసరికి గతంలోని కొన్ని సంఘటనలు మర్చిపోతాడు. తనకు కొడుకు, కూతురు ఇద్దరున్నా.. కూతురున్న సంగతి గుర్తుకురాదు. భార్య చనిపోయిన సంగతీ మర్చిపోతాడు. కడక్ సింగ్ కూతురు సాక్షి (సంజనా సంఘి) తండ్రికి గతాన్ని గుర్తు చేసే ప్రయత్నం చేస్తుంటుంది. ఈ క్రమంలో అతని జీవిత కథంతా చెబుతుంది. ఆత్మహత్యకు ప్రయత్నించడానికి కొన్ని గంటల ముందు ఊహించని పరిస్థితుల్లో కూతురు కంట పడతాడు కడక్ సింగ్. ఆ సమయంలో కూతురు అతణ్ని పదిమంది ముందు నిలదీస్తుంది. అదే రోజు కడక్ సింగ్ ఆత్మహత్యకు యత్నించడం, గతాన్ని మర్చిపోవడంతో కథ మలుపు తిరుగుతుంది. అయితే, సాక్షి మాత్రం తన తండ్రి ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని నమ్ముతుంది. అతణ్ని ఎవరో హత్య చేసేందుకు ప్రయత్నించారని అనుమానిస్తుంది. ఇంతకీ, కడక్ ఆత్మహత్యకు యత్నించాడా, అతణ్ని ఎవరైనా హత్య చేయాలనుకున్నారా, అతనికి గతం పూర్తిగా గుర్తొచ్చిందా అన్నది మిగిలిన కథ.


నమస్తే తెలంగాణ
# జిందగీ
9
హైదరాబాద్ | ఆదివారం 10 డిసెంబర్ 2023 www.ntnews.com




# ఓటీటీలో క్వీన్ వెటరన్

**‘ఏక్ దో తీన్... ఆజా పియా ఆయీ బహార్..’ అని మాధురీ దీక్షిత్ వేసిన స్టెప్పులు నోస్టాలజీ మెమరీ! ‘తూ చీజ్ బడీ హై మస్త్ మస్త్..’ అని రవీనా చేసిన అల్లరికి యువత అంతా ఫిదా అయింది. ఆనాటి అందాల తారలు కాలంతోపాటు తెర మరుగయ్యారు. వారి పాటలను స్మరిస్తూ తరించే ఓ తరానికి ఓటీటీ మరో అవకాశం ఇస్తున్నది. నాటి మేటి నాయికలు ప్రధాన తారాగణంగా రూపొందుతున్న వెబ్ సిరీస్‌లు తొంబైల్లోని యువకుల కలలను మరోసారి తట్టిలేపుతున్నాయి. పూర్తిస్థాయిలో కమర్షియల్ పంథాలో సాగుతున్న సినిమాల్లో అవకాశాలు రావని తలచిన వెటరన్ క్వీన్‌లు ఓటీటీకి ఓటు వేస్తున్నారు. వెబ్ సిరీస్‌లలో తమ అభినయాన్ని ప్రదర్శించి నాటి అభిమానులను అలరిస్తూనే నేటి జనరేషన్‌కూ దగ్గరవుతున్నారు.**

బాలీవుడ్‌లో హీరోలకు దీటుగా అలరించిన నాయికలు ఎందరో ఉన్నారు. ఇప్పుడంటే సింహభాగం సినిమాలు హీరో సెంట్రిక్‌గా రూపొందుతున్నాయి కానీ, ఒకప్పుడు కథానాయిక పాత్రకూ ఎనలేని ప్రాధాన్యం ఉండేది. హీరో కథే అయినా.. హీరోయిన్ పాత్ర గుర్తుండే విధంగా రూపొందించేవారు దర్శకులు. ముఖ్యంగా 90లలో వచ్చిన సినిమాల్లో నటించిన హీరోయిన్లు బాలీవుడ్ క్వీన్లుగా పేరు తెచ్చుకున్నారు. మాధురీ దీక్షిత్, కాజోల్, రవీనా టాండన్, మనీషా కొయిరాలా, సుస్మితా సేన్ తదితర నాయికలు నటించిన చిత్రాలకు భారీ డిమాండ్ ఉండేది. హీరో ఎవరనేది పక్కన పెట్టి మరీ ఈ తారల సినిమాలకు టికెట్లు తెగేవి.

**‘తేజాబ్’,** ‘బేటా’, ‘సాజన్’, ‘హమ్ ఆప్‌కే హై కౌన్’ లాంటి చిత్రాలు మాధురిని టాప్ హీరోయిన్‌గా నిలబెట్టాయి. రవీనా, మనీషా, కరీనా తదితర నాయికలు సైతం తమ మార్కు నటనతో ప్రేక్షకుల దగ్గర మంచి మార్కులు కొట్టేశారు. పెండ్లి చేసుకొని లైఫ్‌లో సెటిల్ కావడంతో ఈ హీరోయిన్లు వెండితెరకు దూరమయ్యారు. కొందరు స్క్రీన్ మీద కనిపించి పదిహేనేండ్లు దాటిపోయింది. ఓటీటీ వచ్చాక వీరికి మంచి రోజులు మొదలయ్యాయి. విభిన్న కథాంశాలతో రూపొందుతున్న వెబ్‌సిరీస్‌లు వెటరన్ నటీమణులకు రెడ్ కార్పెట్ పరిచి స్వాగతిస్తున్నాయి. కథ భారాన్నంతా భుజానికెత్తుకునే పాత్రలు వీరిని వరిస్తున్నాయి. తమ అనుభవాన్నంతా రంగరించి, అభినయంతో అలరించి మళ్లీ బిజీ అవుతున్నారు.

### మాధురీ అదరహో..

మాధురీ 1984 అబోధ్ సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంటర్ అయింది. మొదట్లో పెద్దగా హిట్లు పలకరించకపోయినా.. తర్వాత వరుస విజయాలతో ఇండస్ట్రీలో మోస్ట్ సక్సెస్‌ఫుల్ హీరోయిన్‌గా పేరు సాధించింది. తనంత తాను విరమించే దాకా ఆమె డిమాండ్ కొనసాగింది. ఇండస్ట్రీకి దూరమైనా అడపాదడపా ప్రత్యేక పాత్రల్లో కనిపించింది కూడా! లాంగ్ గ్యాప్ తర్వాత 2022లో నెట్‌ఫ్లిక్స్‌లో వచ్చిన ‘ద ఫేమ్ గేమ్’ వెబ్ సిరీస్‌లో తళుక్కుమన్నది. అందులో హీరోయిన్ పాత్రలో కనిపించిన మాధురీ ఓటీటీలో అరంగేట్రంతోనే విజయాన్ని సాధించింది. అదే ఏడాది ప్రైమ్ వీడియోలో విడుదలైన ‘మజా మా’ చిత్రంలో కీలక పాత్ర పోషించింది. కామెడీ సినిమాలో పక్కా టైమింగ్‌తో తన అభిమానులకు మరోసారి దగ్గరైంది. ఆమె ప్రధాన పాత్రగా రూపొందుతున్న ‘పంచక్’ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది.

### సుస్మితా వెల్‌కమ్

1994 విశ్వసుందరి కిరీటాన్ని సొంతం చేసుకున్న సుస్మితా సేన్ నటిగానూ సక్సెస్ సాధించింది. ‘దస్‌కత్’ చిత్రంతో 1996లో తెర ముందుకు వచ్చిన సుస్మిత ఖాతాలో సూపర్ హిట్లు ఎన్నో ఉన్నాయి. ‘బీవీ నం 1’తో ఇండస్ట్రీని ఊపేసిన ఆమెకు తర్వాత బాక్సాఫీస్‌ను ఊపేసిన సినిమాలు అంతగా దొరకలేదు. అయితేనేం, తన అందచందాలతో హాట్‌స్టార్‌గా పేరు సాధించింది. 2010 తర్వాత ఒకటి, రెండు సినిమాలు మినహా తెరమీద కనిపించలేదామె. 2020లో హాట్‌స్టార్‌లో విడుదలైన వెబ్‌సిరీస్ ‘ఆర్య’తో తన సత్తా చాటింది సుస్మిత. 2021లో సీజన్ 2, గతేడాది వచ్చిన సీజన్ 3 సుస్మిత పాత్ర ప్రధానంగా కొనసాగటం విశేషం. జియో సినిమాలో ఇటీవల విడుదలైన ‘తాలీ’ వెబ్‌సిరీస్ ఆమెలోని విలక్షణ నటిని మరోసారి పరిచయం చేసింది. ట్రాన్స్‌జెండర్లకు ప్రతినిధిగా ఆమె నటించిన పాత్ర కొత్తదనంతోపాటు హిట్‌ను కూడా సొంతం చేసుకుంది.

### రావమ్మా రవీనా

అక్షయ్ కుమార్, అజయ్ దేవ్‌గణ్ హీరోలుగా ఎంట్రీ ఇచ్చినప్పుడు వారి సరసన పర్‌ఫెక్ట్ మ్యాచ్‌గా రవీనా దూసుకుపోయింది. వరుస హిట్లతో గోల్డెన్ లెగ్ అనిపించుకున్నది. 1991లో ‘పత్తర్ కే ఫూల్’ సినిమాతో తన స్టామినా ఎంటో చూపించింది. 1994లో వచ్చిన ‘మొహ్రా’ సినిమాతో ఆనాటి యంగిస్థాన్ కలలరాణిగా అవతరించింది రవీనా! డిమాండ్ తగ్గకముందే తెలివిగా సినిమాలు తగ్గించి తప్పుకొన్న రవీనా మళ్లీ చాన్నాళ్లకు ఓటీటీలో ఎంట్రీతోనే హిట్ కొట్టింది. 2021లో నెట్‌ఫ్లిక్స్‌లో వచ్చిన ‘ఆరణ్యక్’తో మరోసారి ప్రేక్షకులకు దగ్గరైంది. క్రైమ్ థ్రిల్లర్ వెబ్‌సిరీస్‌లో పోలీస్ అధికారిణిగా ఆమె నటనకు అందరూ ఫిదా అయ్యారు.

### కాజోల్.. తగ్గేదే లే..

మాధురి తర్వాత బాలీవుడ్‌ను శాసించిన నటీమణుల్లో కాజోల్ ఒకరు. ఈ సోగకండ్ల సుందరి ఖాతాలో భారీ విజయాలు కోకొల్లలు. ‘డీడీఎల్‌జే’తో యావత్ భారతాన్నీ అలరించిన ఆమె నటనలో కొత్త మార్కును ఫిక్స్ చేసింది. అజయ్ దేవగణ్‌ను పెండ్లి చేసుకున్న తర్వాత సినిమాలకు కాస్త దూరం పాటించింది. చాలారోజుల తర్వాత ధనుష్ హీరోగా నటించిన ‘వీఐపీ 2’ సినిమాలో నటించింది. మళ్లీ కొంత గ్యాప్ తర్వాత ‘ద ట్రయల్’ వెబ్‌సిరీస్‌లో నటించింది. హాట్‌స్టార్‌లో విడుదలైన ఈ వెబ్‌సిరీస్‌లో కార్పొరేట్ లాయర్‌గా కనిపించింది కాజోల్. కుటుంబ సంఘర్షణ, ఏదో సాధించాలన్న తపన కలగలసిన పాత్రను పర్‌ఫెక్ట్‌గా పండించి సీనియారిటీ సత్తా ఏంటో చూపించింది. ఒక్క సిరీస్‌తో ఓటీటీ దర్శక, నిర్మాతలు ఆమె కాల్‌షీట్ల కోసం వెయిట్ చేసేంతగా పేరు సాధించింది.

### వీరేం తక్కువ కాదు



బూరెల్లాంటి బుగ్గలతో అలరించిన జూహీ చావ్లా ఓటీటీలోనూ తన మార్కు చూపుతున్నది. ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అయిన ‘హుష్ హుష్’, నెట్‌ఫ్లిక్స్ సిరీస్ ‘ఫ్రైడే నైట్ ప్లాన్’ జూహీ ఖాతాలో ఉన్నాయి. బాలీవుడ్‌తోపాటు టాలీవుడ్‌లోనూ మెరుపుతీగ అని పేరు సాధించిన సోనాలి బింద్రే క్యాన్సర్ నుంచి కోలుకున్న తర్వాత ఓటీటీపై కన్నేసింది. జీ5లో వచ్చిన ‘ద బ్రోకెన్ న్యూస్’లో కీలక పాత్రలో కనిపించింది. మనీషా కొయిరాలా ‘మస్కా’ సినిమాతో ఓటీటీకెక్కగా, ‘మెంటల్‌హుడ్’ సిరీస్‌తో కరిష్మా ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చింది.

సొట్టబుగ్గలతో, క్యూట్ స్మైల్‌తో ఓ తరం అమ్మాయిలను ఫిదా చేసిన నటుడు మాధవన్. కమర్షియల్ పంథాకు భిన్నంగా ప్రయోగాత్మక సినిమాలు చేయడానికి ఎప్పుడూ ముందుంటాడు. కథ నచ్చితే, పాత్ర నప్పుతుంది అనిపిస్తే సెకండ్ హీరో క్యారెక్టర్‌కు కూడా ఓకే చెబుతుంటాడు. ఓటీటీలోనూ తనదైన విజయాలు సాధిస్తున్న మాధవన్ తాజాగా ‘ద రైల్వే మెన్’ వెబ్‌సిరీస్‌లో కీలక పాత్ర పోషించాడు. 1984 భోపాల్ గ్యాస్ ఉదంతంపై ఓటీటీకెక్కిన ఈ వెబ్‌సిరీస్‌లో సెంట్రల్ రైల్వే జీఎమ్‌గా నటించాడు. ఈ సందర్భంగా వెబ్‌సిరీస్ ముచ్చట్లతో పాటు సినీకబుర్లనూ ఆయన ఇలా పంచుకున్నాడు..

# అవే అసలైన తృప్తినిస్తాయి

**‘ద రైల్వే మెన్’** వెబ్‌సిరీస్ ఒప్పుకోవడానికి చాలా కారణాలు ఉన్నాయి. యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మించడం ఒకటైతే.. ఒక వాస్తవిక గాథ ఆధారంగా రూపొందుతున్న సిరీస్ కాబట్టి వెంటనే ఓకే చెప్పాను. నా పాత్ర నిడివి గురించి అంతగా ఆలోచించలేదు. భోపాల్ ట్రాజెడీని ఎలా మర్చిపోగలం? ఆ రోజు జరిగిన దుర్ఘటన ఎన్ని దశాబ్దాలు గడిచినా గుర్తుంటుంది. అలాంటి ఒక కథాంశంలో నటించే అవకాశం రావడాన్ని చాలెంజ్‌గా తీసుకుంటాను. ఆ సమయంలో మనుషుల భావోద్వేగాలను అనుభూతి చెందడం, పాత్ర ద్వారా పలికించడం చాలా కష్టంతో కూడుకున్న పని. ఈ విషయంలో మా టీమ్ అంతా విజయవంతం అయ్యిందని భావిస్తున్నా!

**వాస్తవ** సంఘటన ఆధారంగా నిర్మించే సినిమాలు చేయాలని ఎప్పుడూ ఉంటుంది. ‘రాకెట్రీ– ద నంబీ ఎఫెక్ట్’ కూడా ఆ తరహా చిత్రమే కదా! అందులో శాస్త్రవేత్త నంబీ పాత్రను పోషించడాన్ని గర్వంగా భావించాను. చేయని తప్పునకు ఆయన పడిన మనోవ్యథను ప్రపంచానికి చాటిచెప్పాలనే ఉద్దేశంతో ఆ చిత్రాన్ని నిర్మించాం. దానికి నిర్మాతగా, దర్శకుడిగా బాధ్యతలు నిర్వర్తించడం మరింత ఆనందాన్నిచ్చింది.

**ఫిక్షనల్** సబ్జెక్టులు ఎంచుకునేటప్పుడు కూడా చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తాను. నేను గతంలో చేసిన ‘త్రీ ఇడియట్స్’, ‘రంగ్ దే బసంతి’ సినిమాలు వినూత్నమైనవి. ఈ రెండు చిత్రాలూ సామాజిక మార్పునకు దోహదం చేసే కథాంశంతో నిర్మితమైనవి. ఒక కమర్షియల్ సినిమాలో నటించినప్పుడు కన్నా.. ఈ తరహా సినిమాలు చేసినప్పుడు ఎక్కువ సంతృప్తి కలుగుతుంది.

**ఫిల్మ్** అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ) ప్రెసిడెంట్‌గా ఎంపికవ్వడం సంతోషంగా ఉంది. ఆ పదవి ఒక అలంకారం కాదు, బాధ్యత. ప్రపంచంలోనే అత్యుత్తమ సంస్థల్లో ఇదీ ఒకటి. ఇక్కడి ప్రమాణాలను మరింత ఉన్నతంగా మార్చే దిశగా నిరంతరం శ్రమించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా నేను విజయవంతం అవుతాననే నమ్మకం ఉంది.




# వావ్ శ్రీలీల

**టాలీవుడ్‌లో** కొత్త సంచలనం శ్రీలీల. ఈ ముద్దుగుమ్మకు 2023 తెగ అచ్చొచ్చింది. 2019లో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన శ్రీలీల చేతి నిండా సినిమాలతో బిజీగా ఉంది. ఈ ఏడాది ఆమె నటించిన, ఒప్పుకొన్న సినిమాల లిస్ట్ పెద్దదే. ‘భగవంత్‌సింగ్ కేసరి’లో సీనియర్ నటుడు బాలకృష్ణ పెంపుడు కూతురుగా పరిణతితో కూడిన నటన ప్రదర్శించింది. ఆ సినిమా హిట్ కొట్టడంతో ఆమె ఖాతాలో భారీ విజయం నమోదైంది. వరుణ్‌తేజ్ హీరోగా వచ్చిన ‘ఆదికేశవ’లో హీరోయిన్‌గా కనిపించింది. మరోవైపు పవన్ కళ్యాణ్ హీరోగా వస్తున్న ‘ఉస్తాద్ భగత్‌సింగ్’లో పవర్‌స్టార్ సరసన నటిస్తున్నది. త్రివిక్రమ్, మహేశ్‌బాబు కాంబోలో నిర్మితమవుతున్న ‘గుంటూరు కారం’ చిత్రంలోనూ శ్రీలీలను కథానాయిక పాత్ర వరించింది. మరో నాలుగైదు సినిమాల్లోనూ అవకాశాలు కొట్టేసింది. తెలుగుతోపాటు మలయాళం, కన్నడ చిత్రాల ఆఫర్లు కూడా వెల్లువలా వస్తున్నాయి. ఇంత బిజీ షెడ్యూల్‌లోనూ వారానికి ఇరవై గంటలు చదువుకు కేటాయిస్తున్నది. ఎంబీబీఎస్ చేస్తున్న శ్రీలీల యాక్టర్‌గా రాణిస్తూనే త్వరలోనే డాక్టర్ అనిపించుకోనుంది. మొత్తానికి దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు స్కూల్ నుంచి వచ్చిన శ్రీలీల ఆయన అంతకుముందు పరిచయం చేసిన కథానాయికల్లాగే సక్సెస్‌ఫుల్ హీరోయిన్ అనిపించుకుంటున్నది. వావ్–హైదరాబాద్ మ్యాగజైన్ 21 యంగ్ అచీవర్స్‌లో చోటు దక్కించుకుంది.



# రెండుచోట్లా విందు వినోదం

**ఫ్యామిలీమ్యాన్** మనోజ్ బాజ్‌పేయి, అక్కినేని వారసుడు నాగచైతన్య ఇద్దరూ తనను ఎంతో ఆదరించారని చెబుతున్నది నటి ప్రాచీ దేశాయ్. మనోజ్‌తో ‘సైలెన్స్ 2’ వెబ్‌సిరీస్ కోసం పనిచేసింది ప్రాచి. ఇటీవల ఓటీటీలో విడుదలై హిట్ టాక్ తెచ్చుకున్న వెబ్‌సిరీస్ ‘దూత’లో నాగచైతన్యతో స్క్రీన్ పంచుకుంది. ఈ రెండు సిరీస్‌ల షూటింగులు వేర్వేరు చోట్ల, వేర్వేరు సమయాల్లో జరిగినా.. తన పట్ల వీరిద్దరూ చూపించిన అభిమానం మర్చిపోలేనని చెబుతున్నది ప్రాచి. పసందైన భోజనంతో ఈ ఇద్దరూ తనను కట్టిపడేశారని కాంప్లిమెంట్స్ ఇచ్చింది. ‘‘దూత’ షూటింగ్ చాలా కూల్‌గా జరిగింది. సీన్ల విషయం పక్కనపెడితే.. లంచ్ బ్రేక్ ఎప్పుడు అవుతుందా అనిపించేది. ప్రతిరోజూ చైతన్య తీసుకొచ్చే డెలీషియస్ వెరైటీలు ఎప్పుడెప్పుడు టేస్ట్ చేద్దామా అని ఎదురుచూసేదాన్ని’ అని చెప్పుకొచ్చింది ప్రాచి. ‘మనోజ్ సార్ కో–స్టార్ గురించి చాలా కేర్ తీసుకుంటారు. అవసరమైన సలహాలు చెబుతారు. పూర్తి స్వేచ్ఛనిస్తారు. అంతేకాదు లంచ్ టైమ్‌కి రుచికరమైన వంటకాలు ఏర్పాటు చేసేవారు. తను స్వయంగా చేసి మరీ తెచ్చేవారు’ అని మనోజ్‌ను ఆకాశానికెత్తేసింది ప్రాచి. మొత్తంగా రెండు షూటింగ్స్‌లోనూ ఒకేరకమైన విందు వినోదం తనకు దక్కాయంటున్నది.

